మన భద్రాద్రి

గురువారం
24 సెప్టెంబర్ 2026

# ప్రజల ఆరోగ్యంపై పాయం స్పెషల్ ఫోకస్..

**గుండాల పీహెచ్‌సీలో వెంటనే శాశ్వత ఎంబీబీఎస్ డాక్టర్‌ను నియమించాలి డీఎంహెచ్‌ఓను ఆదేశించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**గుండాల, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వెంటనే వైద్యులను నియమించాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కే ఖదీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సీజనల్ వ్యాధుల సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్య సేవలు అందక, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించే ఆర్థిక స్తోమత లేక పేద, మారుమూల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున ఎంబీబీఎస్ వైద్యులను నియమించి, 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ)తో ఫోన్‌లో మాట్లాడారు. గుండాల, ఆళ్లపల్లి మండలాలు మారుమూల, పూర్తిగా గిరిజన ప్రాంతాలు కావడంతో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. అత్యవసర లేదా ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడకముందే ఆయా మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెంటనే వైద్యులను కేటాయించాలని, డిప్యూటేషన్ లేదా రొటేషన్ పద్ధతిలో కాకుండా శాశ్వత ప్రాతిపదికన వైద్యులు అక్కడే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊకె బుచ్చయ్య, ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, ఆయా మండలాల నాయకులు వాంకుడోత్ భీకోజీ, ఎస్కే కాసీం, ఊళ్ళోజు భరత్ తదితరులు పాల్గొన్నారు.

# శనగకుంటలో పాఠశాల భవనం లేక విద్యార్థుల అవస్థలు

**స్థానిక గిరిజనులను పట్టించుకోవడం లేదని మంత్రి సీతక్కపై గ్రామస్తుల ఆవేదన**



**మంగపేట, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

ములుగు జిల్లా, మంగపేట మండలం, నరసింహసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామమైన శనగకుంటలో పాఠశాల భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై బుధవారం గ్రామ పెద్దలు, మహిళలు, యువత సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, స్థానిక ఆదివాసీ గూడేలు, గ్రామాల సమస్యలను మంత్రి సీతక్క పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం పాఠశాల భవనం లేకపోవడంతో ఒకే గదిలో 45 మంది గిరిజన విద్యార్థులు ఇరుకుగా కూర్చొని చదువుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఒకే గదిలో పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడుతున్నారని, సరైన తరగతి గదులు లేక వర్షాకాలంలో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు.నిరుపేద ఆదివాసీ గిరిజన పిల్లలు విద్యకు దూరం కాకుండా, సురక్షిత వాతావరణంలో విద్యను అభ్యసించేలా వెంటనే పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. తాత్కాలికంగా రేకుల షెడ్ల నిర్మాణానికి సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తోలేం వెంకన్న, ఎట్టి రవీందర్, తాటి నాగరాజు, తోలేం నరసింహారావు, పాఠశాల చైర్మన్ బొడ్డు సరిత, పెద్దల భరత్, తాటి సతీష్, పెద్దల కృష్ణ, బోధబోయిన నరేందర్, పెద్ది కుమార్, గుండెబోయిన బాలకృష్ణ, తోలేం చంటి, తాటి శ్రీకాంత్, వాసం శ్రావణి, కొమరం శారద, పసుల రాము, మంకిడి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్

**సంక్షేమ పథకాలు పూర్తిగా నిలిచిపోయాయి : రేగా కాంతారావు**



**గుండాల, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా మాజీ అధ్యక్షులు రేగా కాంతారావు ఆరోపించారు. బుధవారం గుండాల మండలంలో పర్యటించిన ఆయన పలు కుటుంబాలను పరామర్శించి, వినాయక మండపాలను సందర్శించారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని రేగా కాంతారావు అన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం, భౌతిక దాడులకు పాల్పడడం వంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పటివరకు జరిగిన ప్రతి అంశానికి లెక్కలు తేలుస్తామని అన్నారు.

**మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..?**

మహిళలకు తులం బంగారం ఇస్తామన్న హామీతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అయితే గతంలో అమలైన కల్యాణలక్ష్మి వంటి పథకాల పరిస్థితి దెబ్బతిన్నదని రేగా కాంతారావు విమర్శించారు. మహిళలు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

**వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు**

గుండాల మండల కేంద్రంలోని ఐదు వినాయక మండపాలను రేగా కాంతారావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

రేగా కాంతారావు సమక్షంలో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. టీజేఎస్ మండల అధ్యక్షుడు గొల్లపల్లి రమేష్ రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు.

**పలు కుటుంబాలకు పరామర్శ**

అనంతరం పార్టీ అధికార ప్రతినిధి రాము తండ్రి రామయ్య ఏడాది మాసిక కార్యక్రమానికి రేగా కాంతారావు హాజరయ్యారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన బొబ్బిలి రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యం నుంచి కోలుకుని వచ్చిన బొబ్బిలి అరుణను కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని సాయినపల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వర్కర్ బొమ్మెర లక్ష్మి మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని కూడా పరామర్శించి కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వీరస్వామి, పార్టీ నాయకులు గడ్డం వీరన్న, వట్టం రవి, సయ్యద్ అజ్జు, అటికం నాగేశ్వరరావు, కాళు, తాటి కృష్ణ, లక్ష్మీనారాయణ, గడ్డం రమేష్, నీట్ట రాములు, రాంబాబు, బండారి రాజు, వెంకన్న, మహేందర్, శోభన్ బాబు, సుధాకర్, లక్ష్మయ్య, బాలు, భూపెల్లి లలిత, చేబోతు గాయత్రి, రాజకుమారి, చంద్రకళ, శ్రీను, రవి, పద్మారావు, సతీష్, ప్రమోద్, ప్రశాంత్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళు పాల్గొన్నారు.

# తిమ్మంపేటలో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

**భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ఘనంగా వీడ్కోలు**





**మంగపేట, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

మండలంలోని తిమ్మంపేట గ్రామంలో బుధవారం వినాయక నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శానం సత్యం--నిర్మల దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నిమజ్జన ఊరేగింపులో మహిళలు నిర్వహించిన కోలాటం నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పు వాయిద్యాలు, భక్తి పాటల నడుమ 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో భక్తులు గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# రైతులకు దసరా ధమాకా.. సోలిస్ యాన్మార్ బంపర్ ఆఫర్

**ట్రాక్టర్ కొనుగోలుపై లక్కీ డ్రా ద్వారా బహుమతులు**




**ఏటూరునాగారం, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

పండుగ వేళ రైతులకు తీపి కబురు. ప్రముఖ ట్రాక్టర్ కంపెనీ సోలిస్ యాన్మార్ తన ఖాతాదారుల కోసం 'దసరా ధమాకా--బంపర్ లక్కీ డ్రా' ఆఫర్‌ను ప్రకటించింది. ములుగు, ఏటూరునాగారం బ్రాంచ్‌ల ఏబీఎస్ సోలిస్ యాన్మార్ యాజమాన్యం ఈ విషయాన్ని తెలిపింది. సోలిస్ యాన్మార్ ట్రాక్టర్లలో అధిక మైలేజ్, తక్కువ డీజిల్‌తో ఎక్కువ విస్తీర్ణం దున్నే సామర్థ్యం, తక్కువ నిర్వహణ ఖర్చు, సులభంగా లభించే విడిభాగాలు వంటి ప్రత్యేకతలు ఉన్నాయని పేర్కొన్నారు. ములుగు ప్రాంతంలోని మిర్చి, వరి, పత్తి రైతుల అవసరాలకు అనుగుణంగా జపాన్ యాన్మార్ సాంకేతికతతో రూపొందించబడిన ఈ ట్రాక్టర్లు బురద దుక్కుల్లో, ఎత్తుపల్లాల్లో మంచి పనితీరు కనబరుస్తాయని తెలిపారు.

ఈ దసరా సందర్భంగా సోలిస్ యాన్మార్ ట్రాక్టర్ కొనుగోలు చేసే ప్రతి రైతుకు లక్కీ డ్రా ద్వారా బంపర్ బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పిస్తున్నామని షోరూం సేల్స్ టీమ్ పేర్కొంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఈ ఆఫర్ పరిమిత కాలం మాత్రమే ఉంటుందని, పూర్తి వివరాలకు ములుగు, ఏటూరునాగారంలోని ఏబీఎస్ సోలిస్ యాన్మార్ షోరూంలను సంప్రదించాలని తెలిపారు.

# గోండి--కోయ భాష వర్క్‌షాప్‌కు రేగా కాంతారావుకు ఆహ్వానం

**మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు**



**గుండాల, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

గుండాల మండల కేంద్రంలో బుధవారం పర్యటించిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, భద్రాచలం ఐటీడీఏ గిరిజన భవన్‌లో అక్టోబర్ 2 నుంచి 6 వరకు నిర్వహించనున్న జాతీయ గోండి--కోయ భాష ప్రామాణీకరణ వర్క్‌షాప్‌కు ఆహ్వానించారు. జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొర వర్క్‌షాప్ వివరాలను వెల్లడించి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆహ్వానాన్ని మన్నించి కార్యక్రమంలో పాల్గొంటానని రేగా కాంతారావు తెలిపారు. అక్టోబర్ 2న జెండా ఆవిష్కరణ, పూజా కార్యక్రమం, అమరవీరులకు నివాళులు, సాంస్కృతిక కార్యక్రమాలతో వర్క్‌షాప్ ప్రారంభమవుతుంది. గోండి--కోయ భాష ప్రామాణీకరణతో పాటు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపై చర్చలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పూనెం రమణబాబు, కార్యదర్శి గొగ్గెల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి క్లస్టర్ క్రీడా ఎంపికలకు ఘనంగా శ్రీకారం

**క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపు**

**విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి**

**ఎమ్మెల్యే కోరం కనకయ్య**



**టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్ సెప్టెంబర్ 23**

టేకులపల్లి మండలం, బద్దుతండాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో భద్రాద్రి క్లస్టర్ స్థాయి క్రీడా ఎంపికలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 2026--27 విద్యా సంవత్సరానికి నిర్వహిస్తున్న ఈ ఎంపికల్లో క్లస్టర్ పరిధిలోని ఏకలవ్య పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులు, సిబ్బంది ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ క్రీడా ఎంపికల్లో వివిధ క్రీడా విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోనున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వారిని తీర్చిదిద్దడమే ఎంపికల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. భద్రాద్రి క్లస్టర్‌తో పాటు తమ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టేకులపల్లి ఎస్ఐ కె. తిరుపతి, ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, మండల కాంగ్రెస్ నాయకులు ఈది గణేష్, పోశాలు, సర్దార్, కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.



# సొంత గూటికి చేరిన గొల్లపల్లి రమేష్

**30 కుటుంబాలతో బీఆర్ఎస్‌లో చేరిక**

**గుండాల, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**



కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నచ్చక గుండాల టీజేఎస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి రమేష్ తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బుధవారం బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు, పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో గొల్లపల్లి రమేష్‌తో పాటు 30 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరి గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి రమేష్ మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీని వీడడానికి కొందరు నాయకుల ఏకపక్ష నిర్ణయాలు, మొండివైఖరే కారణమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికల్లో మద్దతు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలై ప్రతి ఇంటికీ ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, గుండాల మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# ఎల్ఎస్ఎన్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

**బకాయిలు చెల్లించిన తర్వాతే కంపెనీ వాహనాలను తరలించాలి**

**సింగరేణి అనుమతిస్తే బాధ్యత యాజమాన్యానిదే : ఐఎఫ్‌టీయూ**





**టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్ సెప్టెంబర్ 23**

ఎల్ఎస్ఎన్ కంపెనీలో పనిచేసిన కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించిన తర్వాతే కంపెనీ వాహనాలు, యంత్రాలను తరలించాలని ఐఎఫ్‌టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు కే.ఓ.సీ. పీవోతో పాటు టేకులపల్లి సీఐ, బోడు ఎస్ఐలకు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్ మాట్లాడుతూ.. ఎల్ఎస్ఎన్ ఓబీ పనులు పూర్తయినప్పటికీ కార్మికులకు సుమారు 15 నెలల ఈపీఎఫ్, జీతాలు, బోనస్ తదితర బకాయిలు చెల్లించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. మరోవైపు కంపెనీకి చెందిన యంత్రాలు, వాహనాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఐదు పెద్ద ట్రాలీలను కే.ఓ.సీ. ఓబీ పరిసరాల్లో నిలిపి ఉంచారని పేర్కొన్నారు. కార్మికుల బకాయిలు చెల్లించకుండా కంపెనీ వాహనాలను తరలించేందుకు సింగరేణి యాజమాన్యం అనుమతి ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఒక్కో కార్మికుడికి సుమారు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లించకుండా వాహనాలను తరలించేందుకు అనుమతిస్తే అందుకు సింగరేణి యాజమాన్యమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రఘురాం, శ్రీను, అశోక్, లాలయ్య, రత్నాచారి, మోహన్, వస్త్రం లక్ష్మయ్య, రామసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో ఆశాజనకంగా వ్యవసాయం

**వర్షాల సంతోషం ఒకవైపు.. విద్యుత్ కోతల సమస్య మరోవైపు**

**దమ్మపేట, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

దమ్మపేట మండలంలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలు వ్యవసాయ రంగానికి కొత్త ఆశలు చిగురింపజేస్తుండగా, విద్యుత్ కోతలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ వర్షాకాలంలో ఇప్పటివరకు ఇలాంటి భారీ వర్షాలు లేక పంటలు ఎండిపోతాయేమోనని ఆందోళన చెందిన రైతులకు ప్రస్తుత వర్షాలు ఊరటనిచ్చాయి. మండల పరిధిలోని చెరువులు, కుంటలు, వాగులు వర్షపు నీటితో నిండుతున్నాయి. పంట పొలాలకు నీరు అందడంతో పాటు రాబోయే రోజుల్లో పశువులకు తాగునీటి కొరత ఉండదని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షం, గాలి వీచినా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని, రాత్రివేళల్లో చీకటితో పాటు దోమల బెడదను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ వర్షానికే విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎందుకు ఏర్పడుతున్నాయో గుర్తించి, సాంకేతిక లోపాలను సరిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. అవసరమైన మరమ్మతులు చేపట్టి నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





# పోషకాహారంతోనే చిన్నారుల ఆరోగ్య వికాసం

**రక్తహీనతను తరిమికొట్టాలి.. పౌష్టికాహారంపై తల్లులు దృష్టి సారించాలి**

**టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని ఐసీడీఎస్ సూపర్వైజర్ లక్ష్మి అన్నారు. గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంతో పాటు పిల్లల పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. టేకులపల్లి మండలం 9వ మైల్ తండా అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు శ్రీమంతం నిర్వహించి, పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. రక్తహీనతను నివారించేందుకు సమతుల్య ఆహారం తీసుకోవాలని లక్ష్మి సూచించారు. సర్పంచ్ భానోత్ పూర్ణ మాట్లాడుతూ, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం అవసరమన్నారు. వయసుకు అనుగుణంగా సమతుల్య ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వి. సంధ్యారాణి, బి. నీరజ, ఆర్. రాంబాయి, డి. నాగమణి, తల్లులు, కిశోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.



# రేగుబల్లిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

**అన్నదానం, నిమజ్జన వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు**



**దుమ్ముగూడెం, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

దుమ్ముగూడెం మండలం, రేగుబల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 22వ తేదీన నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా భక్తులందరికీ అన్నదానం చేశారు. 23వ తేదీన నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు. ఆడ, మగ అనే తేడా లేకుండా గ్రామస్థులు నిమజ్జన వేడుకల్లో పాల్గొని వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి వినాయక చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మోతుర్కారి కొన్నారా, తోటముళ్ల సంగీతరావు, మోతుకూరి రఘు, వన్నాల అర్జున్, జెట్టి రామకృష్ణ, జెట్టి నిఖిల్‌సాయి, అఖిల్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి ప్రకోపం.. ఈదురుగాలులకు అతలాకుతలం

**మండల వ్యాప్తంగా పలు గ్రామాలు, మొరంపల్లి బంజర్, వేపలగడ్డలో గాలి బీభత్సం**

**నేలరాలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు.. పగిలిన రేకులు**

**విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు**

**బూర్గంపహాడ్, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

ప్రకృతి ఒక్కసారిగా తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించింది. బుధవారం వీచిన బలమైన ఈదురుగాలులు మండల వ్యాప్తంగా పలు గ్రామాలతో పాటు మొరంపల్లి బంజర్ గ్రామం, వేపలగడ్డ ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం చూపాయి. క్షణాల్లోనే గాలుల వేగం పెరగడంతో భారీ వృక్షాలు నేలకొరిగి, విద్యుత్ స్తంభాలు విరిగిపడి, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు ఇళ్లపై, రహదారులపై పడటంతో ఆస్తినష్టం సంభవించింది. విద్యుత్ తీగలు తెగిపడటంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులపై చెట్లు అడ్డంగా పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ప్రకృతి వైపరీత్యం కారణంగా సంభవించిన నష్టంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. ముఖ్యంగా ఇళ్లపై చెట్లు పడటంతో బాధిత కుటుంబాలు నష్టాన్ని చవిచూశాయి. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం సంభవించకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

**అప్రమత్తతే రక్షణ**

ఈదురుగాలులు, భారీ వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించడం, విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించడం, నష్టాన్ని అంచనా వేసి బాధితులకు సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# ప్లాస్టిక్ రహిత లక్ష్మీపురం దిశగా అడుగులు

**క్లాత్ బ్యాగ్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు, మన భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 23**

లక్ష్మీపురం గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా, స్వచ్ఛ లక్ష్మీపురంగా తీర్చిదిద్దడంతో పాటు ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా గ్రామ సర్పంచ్ బాదం వెంకటేశ్వరరెడ్డి రూపొందించిన క్లాత్ బ్యాగ్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. లక్ష్మీపురం గ్రామాన్ని పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలిపేందుకు గ్రామ ప్రజల భాగస్వామ్యంతో నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా క్లాత్ బ్యాగులను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని పేర్కొన్నారు. స్వచ్ఛతతో పాటు పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ లక్ష్మీపురం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ బాదం వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



